తొలగించేందుకు కుట్రలు



17 ఏళ్లుగా సత్యవోలు పంచాయతీలో ఫీల్డ్అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా. పార్టీలకతీతంగా పనులు పెట్టి కూలీలకు ఉపాధి కల్పిస్తున్నా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నన్ను తొలగించి వేరే వ్యక్తిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించాలని టీడీపీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అధికారులు సైతం ఏమీ చేయలేక వారి మాటలే వింటున్నారు. సక్రమంగా పనిచేస్తున్నా తొలగించాలని చూడడం అన్యాయం.

–జడపల్లి రమేష్, సత్యవోలు, కొండాపురం మండలం

నిలిచి పొమ్మన్నారు



ఆరేళ్లుగా ఉపాధి ఫీల్డ్అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. గ్రామంలో అర్హతలు ఉన్న అందరికీ జాబ్‌కార్డులు ఇప్పించి పనులు కల్పించా. ఇటీవల పలువురు టీడీపీ నాయకులు నన్ను నిలిచి పోవాలని బెదిరించారు. వారం రోజుల క్రితం నన్ను తొలగించారు. రెండు నెలల జీతం కూడా ఇవ్వలేదు. ఇంత అన్యాయం ఎక్కడా లేదు.

–పెంచల నరసయ్య, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, అనంతసాగరం

విధులకు రావద్దని చెప్పారు



చామదల ఫీల్డ్అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా. పార్టీలకతీతంగా పనులు పెట్టి కూలీలతో పనులు చేయిస్తున్నా. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నన్ను తొలగించాలని టీడీపీ నాయకులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎమ్మెల్యేకు కూడా లెటర్ పెట్టారని తెలిసింది. ఈ క్రమంలో ఇటీవల ఏపీఓ శ్యామల నన్ను విధులకు రావద్దని సూచించింది.

– కందుల రమాదేవి, చామదల, జలదంకి మండలం

చిరుద్యోగులపై పచ్చకత్తి

కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులనే కాదు..చివరకు చిరుద్యోగులను కూడా విడిచి పెట్టడం లేదు. గ్రామస్థాయిలో కీలకమైన అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, ఉపాధి ఫీల్డ్అసిస్టెంట్లు, రేషన్ డీలర్ల మెడపై పచ్చ కత్తి పెట్టారు. తమ జేబులు నింపుకోవడానికి చిరుద్యోగుల పొట్ట కొడుతున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిని తొలగించి ఆయా స్థానాల్లో తమ వారిని నియమించుకునేందుకు సామదాన దండోపాయాలు ప్రయోగిస్తున్నారు. 'మా ప్రభుత్వం వచ్చింది..మేము చెప్పిన వారే ఉండాలి..వేరే వాళ్లు ఉండడానికి వీల్లేదంటూ' మండలాధికారులపై ఒత్తిడి తెచ్చి చిరుద్యోగులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆత్మకూరు: నియోజకవర్గంలోని చిరుద్యోగులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హడలిపోతున్నారు. ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న చిరుద్యోగులు, రేషన్ డీలర్లు, పొదుపు వీఓఏలు, మద్యం దుకాణాల సిబ్బంది, ఉపాధి ఫీల్డ్అసిస్టెంట్లు..ఇలా ప్రతి ఒక్కరిపై టీడీపీ నాయకులు కక్ష కట్టారు. వారి స్థానాల్లో తమవారిని నియమించుకునేందుకు బెదిరింపులకు దిగుతున్నారు. అధికారులపై ఒత్తిడి చేసి తొలగిస్తుండడంతో వారు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో పనిచేస్తున్న ఉపాధి ఫీల్డ్అసిస్టెంట్లకు స్వచ్ఛందంగా నిలిచిపోవాలని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఒకరిద్దరిని తొలగించగా, మరికొందరికి డెడ్‌లైన్ పెట్టినట్లు సమాచారం. ఈ క్రమంలోనే అధికారులపై ఒత్తిడి తెచ్చి ఉపాధి పనులను సైతం నిలిపివేయించారు. అలాగే గ్రామాల్లో పొదుపు వీఓఏలుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని సైతం తొలగించి తమ వారిని నియమించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ఏళ్ల తరబడి రేషన్ డీలర్లుగా పనిచేస్తున్న వారిని నిలిపివేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. అక్టోబరు 1 నుంచి ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ తీసుకొస్తున్న నేపథ్యంలో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమయ్యారు.

ఉదయగిరి: నియోజకవర్గంలో ఉపాధి హామీ, మధ్యాహ్న భోజన పథకాలు, రేషన్ దుకాణాలు, వైద్యారోగ్య శాఖ, పొదుపులో పనిచేస్తున్న చిరుద్యోగుల పొట్టకొట్టేందుకు టీడీపీ కూటమి నేతలు యత్నిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించి తమ కార్యకర్తలను నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అధికారులపై ఒత్తిడి తెచ్చి కొంతమంది చిరుద్యోగులను నిలిపి వేసి కొత్తవారిని పెట్టారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్అసిస్టెంట్లుగా 86 మంది, సీనియర్, జూనియర్ మేట్లుగా 29 మంది విధులు నిర్వహిస్తున్నారు. 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధి పనులను ఆదాయ వనరుగా మార్చుకునేందుకు తమకు అనుకూలమైన వారిని నియమించుకునే యత్నాలు ప్రారంభించారు. మండలాధికారులపై ఒత్తిళ్లు తెచ్చి ప్రస్తుతం పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిని నయానో,భయానో తొలగించి సొంతంగా పనులు చేయిస్తున్నారు. కాగా గ్రామాల్లో ఉన్న వర్గ విభేదాలతో తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు టీడీపీ నాయకులు కుమ్ములాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మార్పులు చేర్పులకు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు సమాచారం. నియోజకవర్గంలో రేషన్ డీలర్లు 264 మంది ఉన్నారు. సంఘబంధాల ద్వారా నిర్వహిస్తున్న రేషన్ దుకాణాల నిర్వాహకులను ముందుగా మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు డీలర్లను నిలిపి ఆ బాధ్యతలను స్థానిక టీడీపీ నాయకులు, వీఓఏలకు అప్పగించారు. ఇలా ఏదోక కారణాన్ని సాకుగా చూపుతూ చిరుద్యోగులను తొలగించడానికి మండలాధికారులపై టీడీపీ నేతలు ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా సక్రమంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలు అమలు, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగమవుతున్న తమ పొట్టకొట్టవద్దని చిరుద్యోగులు వేడుకుంటున్నారు.

కావలి : నియోజకవర్గంలో 30వేలకుపైగా ఉపాధి జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో 95 మంది ఫీల్డ్అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించడం.. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి వంద రోజుల పనిదినాలు కల్పించడం.. రోజు వేతనం రూ.300కు తగ్గకుండా చూడడం ఫీల్డ్అసిస్టెంట్ల బాధ్యత. ఉపాధి పనుల్లో కీలక పాత్ర పోషిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న ఫీల్డ్అసిస్టెంట్లపై టీడీపీ నాయకులు కక్ష కట్టారు. వారి పొట్టకొట్టి తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు యత్నిస్తున్నారు. అధికారుల ద్వారా ఉపాధి పనులు నిలిపివేయించి ఫీల్డ్అసిస్టెంట్లపై ఒత్తిడి తేవడంతో పాటు నేరుగా పనులు చేసి రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైపు కుటుంబ పోషణ, మరోవైపు రాజకీయ ఒత్తిళ్లతో మానసిక క్షోభకు గురవుతున్నామని ఫీల్డ్అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదుపు మహిళలు, పొదుపు సంఘాలు, పొదుపు సమాఖ్యలకు వారధిగా నిలిచే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ)లు 135 మంది ఉన్నారు. నెలకు రూ.10వేలు జీతంతో పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న వీఓఏల పొట్టకొట్టేందుకు టీడీపీ నాయకులు యత్నిస్తున్నారు. వీఓఏలను స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని పట్టుబట్టుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కావలి మున్సిపాలిటీ, అల్లూరు నగర పంచాయతీల్లో తాత్కాలిక ప్రాతిపదికపై చిరుఉద్యోగులుగా నియమితులై పనిచేస్తున్న వారిపైన టీడీపీ తమ ప్రతాపం చూపుతున్నారు. తమకు సంబంధించిన వారిని నియమించుకునేందుకు రాజీనామా చేయాలని ఒత్తిళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆత్మకూరు నియోజకవర్గంలో చిరుద్యోగులు	
రేషన్ డీలర్లు	159
వైన్‌షాపు ఉద్యోగులు	71
పొదుపు వీఓఏలు	344
ఉపాధి ఫీల్డ్అసిస్టెంట్లు	141

ఉదయగిరి నియోజకవర్గంలో చిరుద్యోగులు	
రేషన్ డీలర్లు	264
వైన్‌షాపు ఉద్యోగులు	71
పొదుపు వీఓఏలు	250
ఉపాధి ఫీల్డ్అసిస్టెంట్లు, మేట్లు	115

నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు



కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చింది. అయితే ఓట్లు వేసి గెలిపించిన వారి నెత్తినే టోపీ పెట్టేలా చిరుద్యోగుల పట్ల పక్షపాత ధోరణిలో నిస్సిగ్గుగా వ్యవహరిస్తుంది. ఇది సరైన వ్యవహారం కాదు. ఇప్పటికైనా తప్పుడు నిర్ణయాలను మార్చుకోవాలి. చిరుద్యోగుల పొట్టకొడితే వారి గోష తప్పదు.

–కే దేవిడ్‌రాజు, సీపీఎం పట్టణ కార్యదర్శి, ఆత్మకూరు

అక్రమంగా తొలగిస్తున్నారు



సీతారామపురం మండలంలోని ఫీల్డ్అసిస్టెంట్లను కూటమి ప్రభుత్వ నాయకుల రాజకీయ ఒత్తిళ్లతో తొలగించడం చాలా దారుణం. మండలంలోని 14 పంచాయతీల్లో 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఏళ్ల తరబడి పనిచేస్తుండగా, అయ్యవారిపల్లి, దేవిశెట్టిపల్లి పంచాయతీల ఎఫ్ఏలను మినహా మిగిలిన 14 మందిని అన్యాయంగా తొలగించారు. నాయకుల ఒత్తిళ్లతో అధికారులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వ మద్దతుదారులను నియమించి వారి ద్వారానే పనులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని త్వరలో కోర్టును ఆశ్రయించనున్నాం.

–బాలినేని నవీన్ కుమార్, మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ అధ్యక్షుడు, సీతారామపురం

చిరుద్యోగులపై ప్రతాపం తగదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిరుద్యోగులపై టీడీపీ నాయకులు ప్రతాపం చూపుతున్నారు. తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఉపాధి కలిగేలా ఇప్పటికే పనిచేస్తున్న చిరుద్యోగులకు ఫోన్లు చేసి నిలిచిపోవాలని బెదిరించడం మంచి పద్ధతి కాదు. అందరి సహకారంతో గెలిచినందుకు మంచి పాలన అందించాలి. అలా కాకుండా చిరుద్యోగుల పొట్ట కొట్టడం మంచిపద్ధతి కాదు.

– వాసిపల్లి లక్ష్మీరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్, బట్టేపాడు

రాజకీయ కక్షలతో ఆస్తుల ధ్వంసం తగదు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దుత్తలూరు: రాజకీయ కక్షలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆస్తులను ధ్వంసం చేయడం టీడీపీ నాయకులకు తగదని జెడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ అన్నారు. మండలంలోని నందిపాడులో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మండ్ల వెంకటేశ్వర్లుకు చెందిన ఆస్తులను వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పరిశీలించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ టీడీపీ నేతల దుశ్చర్యలను ఖండించారు. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో ఇలాంటి దుర్ఘటనలు బాధాకరమన్నారు. టీడీపీ నేతల దుశ్చర్యలను ఎమ్మెల్యే ప్రోత్సహించడం తప్పు అని ఖండించారు. కోర్టులో ఉన్న అంశాన్ని రాజకీయం చేసి ఆస్తులను ధ్వంసం చేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని భావించడం భావ్యం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సివిల్ పంచాయతీని రాజకీయ కోణంలో చూసి ఆస్తులను విధ్వంసం చేయడం తగదన్నారు. పార్టీ నాయకులు కండ్లగుంట వెంకటరెడ్డి, ఎల్వీ కొండారెడ్డి, శివ, గంగాధర్‌రెడ్డి, దొంతిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఉండేలా దశరథరామిరెడ్డి, హరి, తిరుపాల్‌నాయుడు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి: గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి సహకారాన్ని అందిస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెట్టుకూరి శిరీష అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కాకర్ల హాజరయ్యారు. మండలాధికారులతో శాఖలవారీగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఏ పని చేపట్టిన ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. అధికారులు పనులు చేయడానికి లంచాలు అడిగినా, తన పేరు చెప్పి కూటమి నాయకులు లంచాలు అడిగిన ప్రజలు ఇవ్వాల్సిన అవసరం లేదని, నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డిపాళెం వీఆర్వో నరేష్ లంచం లేనిదే ఏ పని చేయడం లేదని, రైతులను ఇబ్బందులు పెడుతున్నాడని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏఓ సురేష్, ఏపీఓ శ్రీనివాసులు, వీఆర్వో నరేష్‌పై విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, తహసీల్దార్ బాలకిషోర్‌ను ఆదేశించారు.

టీడీపీ నాయకుల హడావుడిపై విమర్శలు

మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరుకావాలి. కానీ మండల సర్వసభ్య సమావేశ మందిరంలోకి టీడీపీ నాయకులు వచ్చి హడావుడి చేయడం విమర్శలకు తావిచ్చింది. జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైస్‌ఎంపీపీ పొన్నం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి సోమశిల అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. కమ్మవారిపాళెం సమీపంలో శ్రీకొలను సబ్‌కెనాల్‌ను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సబ్‌కెనాల్ నిర్మాణంతో వెలగపాడు చెరువుకు వాగుల ద్వారా వచ్చే నీరు రావడం లేదని విన్నవించారు. పొలాల్లోకి రాకపోకలు సాగించడానికి కాలువపై బ్రిడ్జి నిర్మాణం లేదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ అశోక్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి మర్రిపాడు మండలం డీసీపల్లి మీదుగా వెన్నవాడ, గండ్లవేడులను కలుపుతూ వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు 12 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మూడు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించే రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డికి సూచించారు. ఆయన వెంట పీఆర్ సీఐయూ విభాగం ఈఈ శ్రీనివాసులు రెడ్డి, డీఈ సుమన, ఏఈ ప్రసాద్ రావు, తదితరులు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధం

వరికుంటపాడు: తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి పేర్కొన్నారు. గొల్లపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. తల్లి ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీలు రమాదేవి, రత్నమ్మ, అనూష పాల్గొన్నారు.

కావలి : పట్టణంలోని కచ్చేరిమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ రామ్‌సెంటర్ సహకారంతో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ మనోహరరెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, పెంచలయ్య, దిలీప్ కుమార్, శివ, రమణయ్య, ఏఎన్ఎం సబిత , మహిళా పోలీసు యశోద, అంగన్‌వాడీలు శాంతి, విజయలక్ష్మి, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: నెల్లూరుపాళెం, కరటంపాడు, పాతజంగాలపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. నెల్లూరుపాళెంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత పాల్గొని తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కేశవనారాయణమ్మ, నాగేశ్వరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సీతారామపురం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత స్త్రీశక్తి భవనంలో వైద్యాధికారిణి స్వప్నరెడ్డి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ భాగ్యమ్మ, డాక్టర్ భవ్యశ్రీ, ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని తూర్పుకంభంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు హెచ్ పద్మావతి, ఎంపీ రత్నమ్మ, ఏఎన్ఎం మస్తానమ్మ, ఆశావర్కర్లు పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

కడనూతల చెరువు ఆక్రమణలపై విచారణ



ఆక్రమణలకు గురైన కడనూతల చెరువు పొరంబోకు

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతల చెరువు ఆక్రమణలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. చెరువు పొరంబోకు భూమి సుమారు 70 ఎకరాలకుపైగా ఆక్రమణలకు గురవడంతో వారం రోజులుగా గ్రామస్తులు, ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులు రెండు, మూడెకరాల వంతున ఆక్రమించుకుని హద్దులు ఏర్పాటు చేసుకోవడంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారుల్లో పలువురు కావలికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా, యూట్యూబ్ చానళ్ల ప్రతినిధులు ఉండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. దీంతో విసుగుచెందిన ఆయకట్టు రైతులు, గ్రామస్తులు రెండు రోజుల క్రితం ఆక్రమణదారులు ఏర్పాటు చేసుకున్న హద్దులు ధ్వంసం చేసి అధికారులపై ఒత్తిడి పెంచడంతో ఎట్టకేలకు విచారణ చేపట్టారు. శనివారం ఆక్రమణకు గురైన భూములు పరిశీలించి సర్వేకు చర్యలు చేపట్టారు. కాగా ఆక్రమణల వ్యవహారంపై సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కల్లుగీత కార్మికులకు ఆర్థిక సాయం



తాళ్ల కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోట ప్రభాకర్

చేజర్ల: మండలంలోని చిత్తలూరుకు చెందిన కల్లుగీత కార్మిక కుటుంబాలకు జిల్లా గౌడ సంఘ అధ్యక్షుడు తోట ప్రభాకర్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల తాళ్ల శ్రీనివాసులు తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మరణించారు. ఆయన కుటుంబాన్ని తోట పరామర్శించి రూ.20 వేలు సాయం అందజేశారు. అనంతరం గౌడ సంఘ అధ్యక్షుడు కోసూరు వెంకట సుబ్బయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనకు రూ.10 వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా తోట ప్రభాకర్ మాట్లాడుతూ గౌడ సంఘ వ్యవస్థాపకులు కోసూరు గోవిందయ్య బాటలోనే బాధిత గీత కార్మిక కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు గీత కార్మిలకు పిల్లలకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ నెల 11న నెల్లూరులోని పురమందిరంలో గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నామని తెలిపారు. గౌడ సోదరులందరూ పాల్గొనాలని కోరారు. జిల్లా గౌడ సంఘ ఉపాధ్యక్షుడు నాసిన పెంచలయ్యగౌడ్, కోసూరు చినగోవిందయ్యగౌడ్, వీ వెంకటేశ్వర్లుగౌడ్, అన్నం సుబ్బారావుగౌడ్, గ్రామ సొసైటీ ప్రెసిడెంట్ దద్దోలు శ్రీరాములుగౌడ్, తాళ్ల రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపు



ఎంఈఓలను ఆహ్వానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరురూరల్: నెల్లూరులోని పురమందిరంలో ఈ నెల 10న నిర్వహించనున్న ఏపీటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. శనివారం వారు ఆత్మకూరు ఎంఈఓలు జ్యోతి, చలపతి, తదితరులను కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ఆహ్వానించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా నాయకులు చేరెడ్డి నరేంద్ర రెడ్డి, శ్రీనివాసులు, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీకి పోలంరెడ్డిపల్లి విద్యార్థిని ఎంపిక



మర్రిపాడు: మండలంలోని పోలిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని చందన ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లుగా హెచ్‌ఎం హరి శుక్రవారం తెలిపారు. గతేడాది పదోతరగతి ఉత్తమ మార్కులు సాధించిన చందన రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందినట్లుగా చెప్పారు. ఈ సందర్భంగా చందనకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



సంగం: మండలంలోని మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో 500కు పైగా మార్కులు సాధించిన పది మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన మేకల హనుమంతరావు శనివారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.10వేలు, రూ.7500, రూ.5వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఆ తరువాత ఉత్తమ మార్కులు సాధించిన ఏడుగురికి రూ.2,500 చొప్పున నగదు అందజేశారు. అనంతరం హనుమంతరావును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ఉచిత దంత వైద్యశిబిరం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని అవినాష్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా దంత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం ప్రారంభించి మాట్లాడారు. దంత సమస్యలతో బాధపడుతున్న పేదల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించిన డాక్టర్ అవినాష్‌ను అభినందించారు. అనంతరం వంద మందికి దంత పరీక్షలు నిర్వహించారు.

పుస్తకాల పంపిణీ

చేజర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్య, నోట్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్‌రావు, అధ్యాపకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

777 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 777 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 866 పొగాకు బేళ్లు రాగా, అందులో 777 బేళ్లను విక్రయించినట్లు తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.358, కనిష్ఠంగా రూ.205, సగటున రూ.297.69 ధర పలికినట్లు వివరించారు. వేలంలో 12 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి చొరవచూపాలి




మాట్లాడుతున్న ఎంపీపీ అనూరాధ

కొండాపురం: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపాలని ఎంపీపీ బొడ్డు అనూరాధ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుజాత ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం మండలాధికారులు శాఖలవారీగా చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక వైద్యశిబిరం

ఆత్మకూరురూరల్: డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మండల జేవీవీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, బీపీ, పక్షవాతం, తదితర సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలను చేయడంతో తక్కువ ధరకే రెండు నెలలకు సరిపడా మందులను అందజేయనున్నట్లు వివరించారు.

పూలదొరువువాసికి డాక్టరేట్



తల్లిదండ్రులతో అవినీష్‌బాబు

కావలి : మండలంలోని పూలదొరువుకు చెందిన తిరుమలశెట్టి అవినీష్‌బాబు భౌతికశాస్త్రంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. తమిళనాడులోని ప్రతిష్టాత్మకమైన వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్)లో ప్రొఫెసర్ మాధురి నేతృత్వంలో మెటీరియల్ సైన్స్‌లో 'ఎనర్జీ కన్వర్షన్ అండ్ ఎనర్జీ స్టోరేజ్' అనే అంశంపై ఆయన పరిశోధనలు సాగించారు. ఆయన పరిశోధనలకు మెచ్చిన విట్స్ విశ్వవిద్యాలయం శుక్రవారం జరిగిన 39వ స్నాతకోత్సవంలో అవనీష్‌బాబుకు డాక్టర్‌ను ప్రదానం చేసింది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన తిరుమలశెట్టి సుధాకర్‌బాబు, రోహిణి దంపతుల కుమారుడైన అవినీష్ భౌతికశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.